


# సత్యవాక్కు

# The Word of Truth

## క్రైస్తవ మాసపత్రిక

JULY - 2010

సంవత్సర చందా రూ. 50/-

## సంక్షిప్త వార్తలు

2010 మే నెల 19 నుండి 22వరకు శ్రీకాకుళం పట్టణంలోని క్రీస్తు సంఘము యూత్ మీటింగ్స్ నిర్వహించిరి. ఆంధ్ర, ఒరిస్సా ప్రాంతముల యువకులు పెక్కు సంఖ్యలో హాజరై గొప్ప ఆత్మీయ సహవాసము నాస్వాదించిరి. సోదరులు R.Ch. సద్గుణరావ్, వారి కుమారుడు ఉత్తమ్ రాజు గార్లు ఈ కూటములను చక్కగా నిర్వహించిరి. సోదరులు జి. సుభాష్ (బాలేరు), బి. పారీచ (ఒరిస్సా) గార్లును, రిక్కీగూటం గారును ఈ యూత్ మీటింగ్స్‌లో వాక్య పరిచర్య చేసిరి. కూటములలో రిక్కీగూటం గారు ముఖ్య వక్తగా వాడబడిరి. కూటములు అనంతరం 9 నుండి క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఈ యూత్ మీటింగ్స్ జయప్రదముగా నిర్వహించుటలో సోదరులు ఉత్తమ్ రాజ్‌గారు ముఖ్యపాత్ర వహించిరి. హాజరైన యువతీ యువకులందరికీ రిక్కీగారు 350 క్రొత్త నిబంధన గ్రంధములను తెలుగు ఒరియా భాషలలో ఉచితముగా పంచిపెట్టిరి. సోదరులు సద్గుణరావు గారు శ్రీకాకుళం జిల్లా అంతటిలో దేవుని కొరకు బలముగా వాడబడుచున్నారు. శ్రీకాకుళంలో ఆయన ఫిలో లోగోస్ స్కూల్ అఫ్ ప్రీచింగ్ నడుపుచున్నారు.

2010 జూన్ 7వ తేదీ సోమవారం హైదరాబాద్ మహానగరం గచ్చిబౌలిలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరై ప్రార్థించి, రిబ్బను కత్తిరించి దేవుని సేవ కొరకు ప్రతిష్టించిరి. గచ్చిబౌలిలో అనేక బహుళ అంతస్థులుగల భవనములు మధ్య క్రీస్తు సంఘ ఆలయం నిర్మించబడుట దేవునికి మహిమయే. అక్కడ సోదరులు సైమన్ పాల్ అనబడే R.S.S. రాజుగారు క్రీస్తు కొరకు బహుగా శ్రమించి సత్యము కొరకై పోరాడుచు ఆలయమును నిర్మించిగొప్ప విజయాన్ని సాధించారు. ఆరోజు సోదరులు Y. సురేంద్ర కుమార్‌గారు (BHEL రామచంద్రాపురం), జాషువాగారు వాక్య పరిచర్య చేసిరి. స్థానిక MLA భిక్షపతి యాదవ్ గారు కూడ హాజరై క్లుప్త ప్రసంగము చేసి సైమన్ పాల్‌గారి కృషిని అభినందించిరి. హైదరాబాద్ పట్టణంలో పనిచేయుచున్న పలువురు మత శాఖల నాయకులు,

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 30 | జూలై - 2010 | సంచిక -12


## క్రైస్తవుడవైన తరువాత నీపాత్ర యేమిటి?

( What you receive after becoming a Christian)

యేసుప్రభువు సువార్తను విని, విశ్వసించి, బాప్తిస్మము పొందినవాడు క్రైస్తవుడగును. అతడు పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందగానే ప్రభువు తన సంఘమందు అతనిని చేర్చుకొనును. అతడు క్రైస్తవుడు కాగానే అనేకమైన ఆత్మీయాధిక్యతలను పొందును, వాటిలో కొన్నిటిని ఈ రోజు తెలిసికొందము.

మొదటిగా ఒకడు క్రైస్తవుడు కాగానే అతడు క్రీస్తు శరీరమైన క్రీస్తు సంఘములో సభ్యుడగును. లేదా ఆయన శరీరములో ఒక అవయవము అగును. "మన మందరము ఒక్క శరీరములోనికి, ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి, మనమందరము ఒక్క ఆత్మను పానము చేసిన వారమైతిమి." "అటువలె మీరు క్రీస్తు యొక్క శరీరమై యుండి వేరువేరుగా అవయవములై యున్నారు" అని అపొ. పౌలు చెప్పాడు (1 కొరింథీ 12:13,27).

క్రీస్తుయొక్క శరీరమే క్రీస్తు సంఘము (ఎఫెసీ 1:22,23; కొలస్స

1:18,24). శరీరములో యుంటే మనము శిరస్సుకు హత్తుకొని యున్నవారము. ఆ శిరస్సే క్రీస్తు. "క్రీస్తు సంఘములో యుంటే మనము దేవునితో సమాధానము గలవారమగుదుము. క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏలుచుండనియ్యుడి; ఇందుకొరకే మీరొక్క శరీరముగా పిలువబడితిరి" యని కొలస్స 3:15లో వ్రాయబడి యున్నది.

**క్రైస్తవుడైనవాడు దేవుని రాజ్య పౌరుడగును.** ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని యేసుప్రభువు చెప్పెను (యోహాను 3:5). మరియు మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనేగాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని ఆయన చెప్పెను (మత్తయి 18:3). క్రీస్తు సంఘమే క్రీస్తు రాజ్యము, దేవునిరాజ్యము; అదే పరలోకరాజ్యము (మత్తయి 16:18,19; హెబ్రీ 12:28). అరాజ్యమునకు రాజు యేసుక్రీస్తే. దేవుడాయనను క్రీస్తుగాను, ప్రభువుగాను ప్రతిష్ఠించెను (అపొ.కా. 2:30-36; 17:7). ప్రజలు క్రీస్తు సువార్తకు లోబడినప్పుడు వారిక మీదట పర జనులును పరదేశులునై యుండక పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై యుందురు (ఎఫెసీ 2:19). అట్టివారు అంధకార సంబంధమైన అధికారమునుండి విడుదల చేయబడి తాను ప్రేమించిన తన ప్రియ కుమారుని రాజ్య నివాసులగుదురు (కొలస్స 1:13).

**క్రైస్తవుడైనవాడు దేవుని బిడ్డయగును.**

క్రీస్తు సంఘమే దేవుని కుటుంబము (1తిమో 3:15;అపొ.కా. 10:2). మనం బాప్తిస్మము పొందినప్పుడు క్రీస్తు ద్వారా బిడ్డలమగుదుము. "యేసు క్రీస్తునందు మీరుందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు" (గలతీ 3:26). దేవుని బిడ్డలవలె మనము ప్రార్థన చేయు ఆధిక్యతను, ఆయన నుండి భద్రతను, ఆయన కృపను, దీవెనలను పొందుదుము.

**తరువాత ఒకడు క్రైస్తవుడైనప్పుడు అతడు ప్రభువు మందలో ఒక గొర్రె యగును.**

దావీదు వ్రాసిన 23వ కీర్తనను గొర్రెల కాపరి కీర్తనయని మనము చెబుతాము. క్రీస్తు మందలో యుంటే ఆదరణను, భద్రతను మనము పొందుతాము. "యెహోవా నా కాపరి, నాకు లేమి కలుగదు" అను మాటలలో గొప్ప విశ్వాసమున్నది. నాకు లేమి కలుగదు అను మాటలలో గొప్ప నిర్ధారణ యున్నది. పచ్చికగల చోట్లను ఆయన నన్ను పరుండ జేయుచున్నాడు అనుటలో సంతృప్తి వ్యక్తమగుచున్నది. శాంతికరమైన జలముల యొద్ద నన్ను నడిపించుచున్నాడు అనుటలో గొప్పశాంతి యున్నది. నా ప్రాణమునకు ఆయన సేద తీర్చుచున్నాడు అను మాటలలో జీవమున్నది. తన నామమును బట్టి నీతి మార్గములలో

నన్ను నడిపించుచున్నాడు - అనగా మంచి నాయకత్వం గోచరించుచున్నది. గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను - అను మాటలలో ధైర్యమున్నది. "నీవు నాకు తోడై యుందువు" అనుటలో - సహవాసము, నీదుడ్డు కఱ్ఱయు, నీదండమును నన్ను ఆదిరిం చును అను మాటలలో సంరక్షణ యున్నది. నూనెతో నాతల అంటి యున్నావు-అనగా నీకృపతో నన్ను నింపి యున్నావు. నా గిన్నె నిండి పొర్లు చున్నది- సంతోషము ఉప్పొంగుచున్నది. నేను బ్రదుకు దినములన్నియు కృపాక్షే మములే నావెంట వచ్చును. అనగా దేవుని దీవెనలు ఆయన సంఘములో యున్న వారి వెంటవచ్చును. చిరకాలము యెహోవా మందిరములో నివాసము చేసెదను అనగా నిత్యత్వాన్ని సూచించు చున్న మాటలు. దేవుని మందలో యున్నవారికి ఏమేలును కొదువ యుండదు, క్రీస్తుసంఘయే దేవుని మంద! క్రైస్తవుడైన వాడు క్రీస్తు సైన్యములో ఒకసైనికుడు.

"మంచి సైనికునివలె నాతో శ్రమను అనుభవించుము" అని అపొ.పౌలు తిమోతిని హెచ్చరించాడు (2 తిమో 2:3). క్రైస్తవులు అపవాదితోను, అతని అనుచరులతోను నిరంతరము పోరాటము సాగింతురు. అయితే అపొ. పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "మేము శరీరధారులమై నడుచుకొను చున్నను శరీర ప్రకారము యుద్ధము చేయము. మా యుద్ధోపకరణములు శరీర సంబంధమైనవి కావుగాని, దేవుని యెదుట దుర్గములను పడద్రోయ జాలినంత బలము కలవై యున్నవి" (2 కొరింథీ 10:3,4). క్రీస్తే మన సైన్యాధిపతి. మంచి పోరాటమును పోరాడితే మనకొక జీవ కిరీటము దాచబడి యున్నది (2 తిమోతి 4:6-8).

క్రైస్తవుడైనవాడు దేవుని ద్రాక్ష తోటలో పనివాడు (మత్తయి 20:1-16). క్రీస్తు సంఘము క్రీస్తు కొరకు పని చేయు వారితో నిండి యుంటాది. సోమరి పోతులు ఆయనకు అక్కర లేదు. ఆయన సంఘములో మనము పని చేయాలి, ఆయనతో కలిసి పనిచేయాలి. అందుకే "మేము దేవుని జత పనివారమై యున్నాము; మీరు దేవుని వ్యవసాయమును, దేవుని గృహమునై యున్నారని" కొరింధులోని క్రైస్తవులను పౌలు హెచ్చరించాడు (1 కొరింథీ 3:9). ఏలయనగా "కన్నీళ్లు విడుచుచు విత్తువారు సంతోషగానముతో పంట కోసెదరు. పిడికెదు విత్తనములు చేత పట్టుకొని యేడ్చుచుపోవు విత్తువాడు సంతోషగానము చేయుచు పనలు మోసికొని వచ్చును" (కీర్తన 126:5-7). కాగా నాప్రియ సహోదరులారా, మీప్రయాసము ప్రభువు నందు వ్యర్థము కాదని యెరిగి స్థిరులును కదలని వారును, ప్రభువు కార్యాభివృద్ధి యందు ఎప్పటికిని

ఆసక్తులునై యుండుడి" (1కొరింథీ 15:58). క్రైస్తవుడైన వాడు ద్రాక్షావల్లి యైన క్రీస్తులో నిలిచియున్న తీగవంటి వాడు (యోహాను 15:1-8). అందు వలన అతడు మంచి ఫలములు ఫలించును, లేదా పెరికి బయట పార వేయబడును.

క్రైస్తవుడు క్రీస్తు సంఘములో ఒక యాజకుడు, ఆరాధికుడు. అందువలన ఆయనకు నిత్యము ఆత్మ సంబంధమైన బలుల నర్పించునట్టివాడు. క్రైస్తవుడు తన జిహ్వాఫలమును, శరీరమును, ధనమును, తలాంతులను ఆయనకు హృదయ పూర్వకముగా సమర్పించును.

క్రైస్తవుడు క్రీస్తు యొక్క వధువు వలె పవిత్రముగా యుంటూ ఆయన రాక కొరకై వేచి యుండును.

నీవు క్రైస్తవుడవు కానిచో ఈ గొప్ప ఆత్మీయాశీర్వాదములన్నిటిని పోగొట్టు కొనుచున్నావు. యేసు ప్రభువు నందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారు మనస్సు పొందుము, యేసే దేవుని కుమారుడని ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము, క్రైస్తవుడవు కమ్ము!

**క్రైస్తవ రుజువులు**

# పురాశిల్ప వస్తు శాస్త్రము నుండి రుజువు

## (Evidence from Archaelogy)

యేసుక్రీస్తును గూర్చి, ఆదిమ క్రైస్తవ్యాన్ని గూర్చి పురాతన వస్తుశిల్ప శాస్త్రము యేసును బయలు పరచుచున్నది. క్రొత్త నిబంధన క్రైస్తవ్యాన్ని బలపరిచే ప్రదేశములను గాని, పురాతన వస్తువులను గాని పురాశిల్ప శాస్త్రజ్ఞులు జరిపిన త్రవ్వకములలో క్రొత్త నిబంధన క్రైస్తవ్యము యొక్క చారిత్రాత్మకతను, యదార్థతను ధృవీకరించు వాస్తవములనేకములను కనుగొనిరి. అవ్విధముగా క్రొత్త నిబంధన యొక్క యదార్థతను వారు మరింత బలపరచిరి.

**చరిత్రకారుడైన లూకా:**

అపొస్తులులకార్యముల గ్రంధ మును లూకా సువార్త గ్రంధమును లూకాయే వ్రాసెనని అంతరంగిక రుజువుల వలన తేటపడుచున్నది. ఈ గ్రంధములు క్రొత్త నిబంధనలో 4వ వంతు ఉండుటచే, లూకా నమ్మదగిన వాడోకాదో తెలిసికొనుట ప్రాముఖ్యము.

లూకా కొన్ని ప్రదేశములు, పట్టణములు, సంఘటనలను గూర్చి తన గ్రంధాలలో వ్రాసాడు. గాని క్రొత్త నిబంధనలో తప్ప వేరే ఎక్కడా వాటిని గూర్చి చెప్పబడలేనందున లూకా

వ్రాసినది నమ్మవచ్చునో కాదోయని చరిత్రకారులు తలంచారు. గాని ఈ మధ్య పురాశిల్ప శాస్త్రజ్ఞులు కనుగొన్న వాస్తవములు లూకా వ్రాసిన సంగతులు యదార్థములని నిరూపించుచు, అతనిని విమర్శించిన వారి నోళ్లు మూయించాయి.

**యేసు జన్మ సందర్భ సంఘటనలు :**

యేసు జనన సందర్భముగా సంభవించిన సంగతులను గూర్చి లూకా తప్పుగా వ్రాసాడని చరిత్రకారులు తలంచారు. (లూకా 2:1-3). ఆ కాలమందు ప్రజా సంఖ్య యేమీ వ్రాయబడలేదు. ప్రజలు తమ తమ స్వగ్రామములకు వెళ్లనవుసరం లేదని, కురేనియ సిరియకు అధిపతికాడని వారు వాదించారు.

గాని, ప్రతి 14 సంవత్సరముల కొకసారి పన్ను చెల్లించే ప్రతివారు తమ స్వస్థలములకు వెళ్లవలెనని పురావస్తు శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. క్రీ॥పూ ॥ 8వ సంవత్సరములో అట్టి జనసంఖ్య ఒకటి వ్రాయబడెను. లూకా బహుశ దీనిని గూర్చియే వ్రాసాడు.

క్రీ॥పూర్వము 7వ సంవత్సర కాలములో సిరియాకు కురేనియ అధిపతిగా యుండెననే శిలాఫలకము నొక దానిని అంతియొకయలో శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. సిరియాకు అధిపతిగా కురేనియ రెండు మారులు క్రీ॥పూ 7లోను క్రీ॥శ 6లోను పనిచేసెనని ఇప్పుడు శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

ఐగుప్తు దేశములో ఒక కాగితపు చుట్టను కనుగొన్నారు. రాబోవుచున్న ప్రజాసంఖ్యను గూర్చిన హెచ్చరికలు అందులో వ్రాయబడియున్నాయి. అది యిట్లు చెప్పింది. "రాబోవుచున్న ప్రజా సంఖ్యను బట్టి, ఎవడైనను, ఏదైనా కారణము వలన తన స్వదేశమునకు వెంటనే వెళ్లుటకు సిద్ధపడవలెను. అవ్విధముగా వారు తమ కుటుంబములను రికార్డులోనికి చేర్పించ గలరు. అప్పుడు రికార్డు సంపూర్తియగును". ఈ రీతిగా లూకా వ్రాసినది కరక్టేయని పురావస్తు శాస్త్రజ్ఞులు నిరూపించిరి.

**లూసానియ (Lysanias) :**

లూకా 3:1లో అబిలేనే దేశమునకు లూసానియ అధిపతిగా యుండెనని, తిబెరి కైసరు యొక్క ఏలుబడిలో 15వ సంవత్సర మందుండెనని లూకా వ్రాసాడు. అంటే అది క్రీ॥శ॥ 27వ సంవత్సరము. దీనిని విద్యావేత్తలు హేళన చేసారు. వారెరిగిన ఒకే ఒక్క లూసానియా అనువాడు. క్రీ॥పూ॥ 36లో చంపబడెను.

గాని శాస్త్రజ్ఞులు దమస్కు పట్టణంలో ఒక శిలాఫలకమును కనుగొనగా అందు లుసానియ అనునతడు క్రీ॥శ 14 నుండి 29 వరకు అబిలేనే దేశమునకు అధిపతిగా యుండెనని వ్రాయబడియున్నది! ఇందు మూలముగా లూకాయే కరెక్టని మరొక మారు రుజువాయెను.

**జనుల సభ (Polytarch ) :**

అపొ.కా 17:5లో లూకా జనుల సభ అనే పదాన్ని ఉపయోగించాడు. ఇదొక గ్రీకు పదము గాని ఆ పదాన్ని సాంస్కృతిక గ్రీకు భాషలో వాడేవారు కాదు, గనుక లూకా 'జనుల సభ' అనే పదాన్ని వాడి తప్పుచేసాడని అనేకులు తలంచారు. గాని థెస్సలోనిక పట్టణంలో మొదటి శతాబ్ధములో నిర్మించబడిన ధనురాకార శిలా వంకరమును (arch) ఒక దానిని కనుగొనగా దానిపై "జనుల సభ" కాలంలో అని వ్రాయబడియున్నది! ఈ మధ్య కాలంలో శాస్త్రజ్ఞులు "జనుల సభల" ను గూర్చి చెప్పు పురాతన శిలాఫలకములను ముప్పయి అయిదింటిని కనుగొన్నారు. అందులో ఐదు పౌలు కాలములో థెస్సలోనికయలో వ్రాయబడినవే!

**ఈకొనియ (Iconium) :**

అపొ.కా. 14:6 లో లుస్త్ర, దెర్బే అను పట్టణములు లుకయొనియలో యున్నట్లు లూకా వ్రాసాడు. ఈ కొనియ మాత్రం కాదన్నట్లును వ్రాసాడు. లూకా తప్పు అని ఈకొనియ లుకయొనియలో భాగమేనని చరిత్రకారులు చెప్పేవారు. రోమన్ గ్రంధకర్తలగు సిసేరో, స్ట్రేబో, ప్లినీ మొ॥గు వారి వ్రాతలపై ఆధారపడి అపొస్తలుల కార్యముల గ్రంధము వాస్తవం కాదని వారన్నారు.

అయితే 1910 సం॥లో సర్ విలియం రామ్సే అనునతడు ఈ కొనియ లుకయొనియలో గాక ఫ్రుగియలోని పట్టణమని కనుగొన్నాడు. ఈకొనియలో దొరికిన రెండు శిలా ఫలకములను బట్టి పౌలు దర్శించిన తరువాత ఇంచుమించు రెండువందల సంవత్సరములు మట్టుకు ఫ్రుగియ భాష అక్కడ వాడుకలో యున్నట్లు రుజువాయెను. మరల, లూకాయే రైటాయెను. అతని విమర్శకులు దోషులైరి.

సర్ విలియం రామ్సే ఈ భూమి మీద నివసించిన పురాతన వస్తు శాస్త్రజ్ఞులలో ఘనుడు. లూకా చెప్పిన 35 దేశములు, 54 పట్టణములు, 9 ద్వీపములను పరిశోధించి లూకా ఏ ఒక్క దానిని గూర్చి కూడ తప్పు చేయలేదని కనుగొన్నాడు.

చరిత్రాత్మక ప్రదేశములను సంఘటనలను గూర్చి చెప్పునప్పుడు లూకా అంతజాగ్రత్తగా యుంటే, అంతకన్నా ప్రాముఖ్య సంగతులగు యేసుక్రీస్తు యొక్క అద్భుతములు, బోధలు, మరణం, సమాధి, పునరుత్థానములను గూర్చి మరింత ఎక్కువ జాగ్రత్త వహించి యుండెననుట సమంజసమే.

**గబ్బతా — రాతి మంటపము :**

యేసును విమర్శించి పిలాతు ఆయనకు మరణ శిక్ష విధించిన గబ్బతా అను రాతిమంటపము యొక్క రికార్డు

యేమీ లేదని కొందరు శంకించారు (యోహాను 19:13). గబ్బతా ఒక కల్పిత స్థలమని, యోహాను సువార్త చారిత్రాత్మ కము కాదని సందేహ శీలురు తలం చారు.

అయితే పురావస్తు శాస్త్రజ్ఞులు గబ్బతా అను స్థలము యెరూషలేములో రోమన్ మిలటరీ కేంద్రమైన అంటోనియాస్థాపములో భాగమైయుండె నని ఈ మధ్య కనుగొన్నారు. క్రీ॥శ 66-70లో యెరూషలేము ముట్టడి వేయబడి శిథిలమైనప్పుడా స్థలము కూలగొట్టబడి పాతిపెట్టబడెను. హాద్రియన్ పాలనలో యెరూషలేము తిరిగి కట్టబడినప్పుడు కూడా ఆ స్థలము భూ స్థాపితమై యుండెను. ఈ మధ్య కాలములో అది కనుగొనబడే వరకు అట్లే యుండెను. పిలాతుచే యేసుకు తీర్పు తీర్చబడిన ఆ రాళ్ల మంటప స్థలమును ఈనాడు నీవు కూడా వెళ్లి చూడవచ్చును.

**యోహాను సువార్త :**

చరిత్రకారులు ఎరుగని స్థలము లను గూర్చి యోహాను తన సువార్తలో వ్రాయుటచే సందేహశీలురు యోహాను సువార్త నమ్మదగినది కాదని యనుకొనే వారు. గ్రంథకర్త ఆయా వివరాలను సరిగా లిఖించలేదు గనుక అతడు రెండవ శతాబ్ధములో జీవించి యుండవచ్చును, ఆ సువార్తలో చెప్పబడిన సంఘటనలకు, ప్రదేశములకు అతడు సుదూరములో యున్న వ్యక్తియై యుండవచ్చని వారన్నారు.

**బేతెస్ధ కోనేరు :**

ఉదాహరణకు బెతేస్ధ కోనేటి దగ్గర 35 ఏండ్ల నుండి వ్యాధిగ్రస్తుడైన వానిని యేసు బాగుచేసినట్లు యోహాను వ్రాసాడు (యోహాను 5:1-15). ఆ కోనేరులకు అయిదు మంటపములున్నట్లు యోహాను వ్రాసాడు. యోహాను యొక్క పొరబాట్లకు ఇదొక ఉదాహరణ, అట్టి ప్రదేశమును గూర్చి ఎవరు ఏనాడు వినలేదని సందేహాశీలురు అన్నారు.

అయితే ఈ మధ్యకాలములో యెరూషలేముకు ఈశాన్యదిశలో పురావస్తు శాస్త్రజ్ఞులు బేతెస్ధ కోనేటిని త్రవ్వి దానిని కనుగొన్నారు. నేల మట్టమునకు 40 అడుగులు దిగువలో దాని నీరుండేది. ఆ కోనేరు చుట్టూ యోహాను చెప్పినట్లే అయిదు మంటపములు, ద్వారములున్నాయి!

**కయఫ సమాధి స్థలము :**

యేసు ప్రభువుకు తీర్పు చెప్పి, శిక్ష విధించి, సిలువ వేసిన సమయంలో కయఫ అనునతడు యూదుల ప్రధాన యాజకు డుగా యుండెనని క్రొత్త నిబంధన చెప్పు చున్నది. (మత్తయి 26:3, 57; యోహాను 11:49; 18:14,28). అయితే రోమీయులు క్రీ॥శ 70లో దేవాలయపు రికార్డులన్నిటినీ నాశనం చేసేసారు. కయఫ అనునతడు ఎప్పుడైనా జీవించాడో లేదో యూదుల చరిత్ర కనుగొనలేక పోయింది.

1990లో యెరూషలేములో జల

వినోద స్థలమును (Water Park) నిర్మించుచున్న సమయంలో కొందరు షనివారు అనుకొనని రీతిగా పురాతన సమాధుల గుహను ఒకదానిని కను గొన్నారు. ఆ గుహలో 60 సం॥ల వయసు గల ఒక పురుషుని అస్థికలుండెను. అవి ప్రధాన యాజకుడైన కయఫకు చెందినవని తలంచబడెను. పగుళ్లు తీసిన ఒక పెద్ద రాతిపెట్టెమీద, యోహెూసెఫ్ బర్ కయఫస్ (Yehosef bar Kayafas) ( Joseph Son of Caiphas) అని చెక్కబడి యుండెను, అనగా కయఫ కుమారుడైన యోసేపు అని అర్థము. ఆ గుహలో కనుగొనబడిన ఇత్తడి నాణెములు క్రీ॥శ 42-43లో హేరోదు అగ్రిప్ప-1 కాలములో తయారుచేయబడెను.

క్రీ॥శ॥ 18 నుండి 26 వరకు కయఫ అనబడిన యోసేపు యెరూషలేములో ప్రధాన యాజకుడుగా యుండెనని జోసీఫస్ అను యూదుల చరిత్రకారుడు వ్రాసాడు. యోసేపు అనునది కయఫయొక్క అసలు పేరు.

**పురావస్తు శాస్త్రము కనుగొన్న ఇంకా కొన్ని :**

క్రొత్త నిబంధన చారిత్రాత్మకంగా యదార్థమని పురావస్తు శాస్త్రం పదే పదే నిరూపించినది.

పురావస్తు శాస్త్రజ్ఞులకు వందన ములు. ఇప్పుడు మనం యేసుక్రీస్తు జన్మ స్థలమగు బేత్లేహేమును, ఆయన పెరిగిన నజరేతును, కపెర్నహూములో యున్న సమాజ మందిరమును (అక్కడ యేసు అపవిత్రాత్మ పట్టిన ఒకని బాగుచేసారు), పేతురు అత్తయింటిని, యేసు ఒక గ్రుడ్డివానిని బాగుచేసిన సిలోయము కోనేటిని, గెత్సేమనే తోటను (అక్కడ యేసు తాను అప్పగింపబడిన రాత్రంతా ప్రార్థించారు), యేసు యెరూషలేములో విజయోత్సవముతో ప్రవేశించిన బంగారు సింహ ద్వారమును, ప్రత్యక్షముగా చూడవచ్చును. పిలాతు యేసుకు శిక్ష విధించిన గబ్బతా స్థలమును, క్రీస్తు సిలువ మోయుచు కల్వరి వరకు వెళ్లిన మార్గమును, తాను ఎమ్మాయు మార్గమున ఇద్దరు శిష్యులకు కనబడిన మార్గమును ఇప్పుడు కూడ సందర్శించవచ్చును.

**ముగింపు :**

క్రొత్త నిబంధన చారిత్రకంగా వాస్తవమనే రుజువులు యొక్క నిర్ధారణ సాంపిల్‌ను మాత్రమే పురావస్తు శాస్త్రము ద్వారా ఈ పాఠంలో కొంత వరకు మనం చూచాము. ప్రముఖ యూదుల పురావస్తు శాస్త్రయగు నెల్సన్ గ్లూక్ అనునతడు, "పురావస్తు శాస్త్రము కనుగొన్న దేదియు బైబిలులో చెప్పబడినది యదార్థము కాదని నిరూపించలేక పోయిందని ఖచ్చితముగా చెప్పవచ్చును" అని యన్నాడు. ఇంకో మాటలో బైబిలుకు పురావస్తు శాస్త్రానికి మధ్య వైరుధ్యము యేమీ లేదు.

సర్ విలియం రామ్సే అను ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శాస్త్రజ్ఞుడు, అపొస్తలులు కార్యముల గ్రంధము వాస్తవం కాదని నిరూపించడానికి అతడు ప్రయత్నం చేసాడు. అయితే అతడు కనుగొన్న వాస్తవములతని దృకృధాన్ని మార్చి వేసాయి. లూకా వ్రాసిన వివరణలు అశ్చర్యకరమైన సత్యాలు అని అతడు కనుగొన్నాడు. "లూకా ప్రధమ శ్రేణి చరిత్రకారుడు; అతడు చెప్పిన సంగతులు సత్యమే గాక అతడు చారిత్రాత్మక దృక్పథం కలిగియున్నాడు. ఇంకోమాటలో ఈ గ్రంధకర్త చరిత్ర కారులలో గొప్పవాడుగా ఎంచబడవలెను" అని అతడు వ్రాసాడు.

క్రొత్త నిబంధన చారిత్రాత్మక గ్రంధమువలె ఆధారపడవచ్చునను సంగతిని పురావస్తు శాస్త్రము రూఢిపరుస్తూనే యున్నది.

– రిచర్డ్ ఏడీ

## నాశనమునకు ముందు గర్వము నడచును

"బబులోనను ఈ మహా విశాల పట్టణము నాబలాధికారమును నాప్రభావ ఘనతను కనబరచుటకై నా రాజధాని నగరముగ నేనే కట్టించినది కాదా"! అని రాజైన నెబుకద్నెజరు తనలో తానను కొనెను రాజు నోట ఈ మాట యుండగా ఆకాశము నుండి యొక శబ్దము వచ్చెను ఏదనగా రాజగు నెబుకద్నెజరూ, ఇదే నీకు ప్రకటన. నీరాజ్యము నీయొద్ద నుండి తొలగి పోయెను. అదే సమయములో నెబుకద్నె జరు యెడల అది నెరవేరెను అది ఎట్లనగా తమ యొద్ద నుండి మనుష్యులు నిన్ను తరిమెదరు . నీవు అడవి జంతువుల మధ్య నివాసము చేయుచు పశువుల వలె గడ్డి మేసెదవు ఆకాశపు మంచు అతని దేహ మును తడపగా అతని తల వెండ్రుకలు పక్షిరాజు రెక్కల ఈకెల వంటివియు, అతని గోళ్ళు పక్షుల గోళ్ల వంటివియు ఆయెను (దానియేలు 4:30–33). ప్రవక్తయైన దానియేలు ప్రవచన ప్రకారము రాజైన నెబుకద్నెజరు తన యొక్క అహంకార ధోరణిని బట్టి ఏడు సంవత్సరములు అట్టిరీతిగా బాధపడెను. యెహోవా దృష్టికి అయిష్ట మైనటు వంటి అహంకార స్వభావమును బట్టి అతడు హీన పరచబడెను (సామె 6:16). నిజముగ నాశనమునకు ముందు గర్వము నడచును. ఆయన దూరము నుండి గర్విష్ఠులను బాగుగ ఎరుగును. ఆయన మహోన్నతుడైనను దీనులను లక్ష్య పెట్టును (కీర్త 138:6).

దేవదూతల యొక్క నాయకుని హృదయములో గర్వము ప్రవేశించినపుడు అతడు దేవుని సన్నిధిలో యండే యోగ్యతను కొల్పోయి క్రిందికి త్రోసివేయబడినట్లు వాక్యము తెలియజేయుచున్నది. "తేజో నక్షత్రమా, వేకువచుక్కా, నీవెట్లు ఆకాశము

నుండి పడితివి? నేను ఆకాశమునకెక్కి పోయెదను దేవుని నక్షత్రములకు పైగా నా సింహాసనమును హెచ్చింతును ఉత్తర దిక్కున నున్న సభాపర్వతము మీద కూర్చుందును మేఘ మండలము మీది కెక్కుదును. మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని నీ మనస్సులో అను కొంటివిగదా! నీవు పాతాళమునకు నరకములో ఒక మూలకు త్రోయబడితివే" (యెషయా 14:12-15). దేవుని దృష్టిలో పాపము చేసిన దేవ దూతలను కూడ ఆయన విడిచిపెట్టలేదు. తమ ప్రధానత్వము ను నిలుపు కొనక, తమ నివాస స్థలమును విడిచిన దేవదూతలను మహాదినమున జరుగు తీర్పు వరకు కటిక చీకటిలో నిత్య పాశములతో ఆయన బంధించి భద్రము చేసెను (1 పేతురు 2:4; యూదా 6). నిజముగ నాశనమునకు ముందు గర్వమునడచును.

యూదారాజైన ఉజ్జియా యొక్క విశాధ గాధను మనము 2దినవృత్తాంత ములు 26వ అధ్యాయములో చదువుదుము. తన శత్రువులపై అనేక విజయములను దేవుడతనికి అనుగ్రహించెను. మంచి బలమైన సైన్యము అతని కుండెను. అనేక పట్టణములను అతడు కట్టించెను. అతడు యెహోవాను ఆశ్రయించినంత కాలము దేవుడతని వర్ధిల్ల జేసెను. అతడు రాజరికములో చాల యెక్కువగ స్థిరపడి బలపడు వరకు ఎంతో ఆశ్చర్యకరమైన రీతిగ దేవుడతనికి తోడై యుండెను. అయితే అతడు స్థిరపడిన తరువాత అతడు మనసున గర్వించి చెడిపోయెను. అతడు దేవుని ఆజ్ఞకు విరుద్ధముగ ధూప పీఠము మీద ధూపము వేయుటకు దేవుని మందిరములో ప్రవేశించి దేవునికి ద్రోహము చేసెను (2 దినవృత్తాం 26:16). యాజకులును, అహరోను కుమారులు మాత్రమే ధూప పీఠము మీద ధూపము వేయవలెను. కాని రాజు హృదయమున గర్వించి దేవుని ఆజ్ఞను తిరస్కరించెను. ప్రధాన యాజకుడైన అజర్యాయును, యాజకులందరును అతని వైపు చూడగా అతడు నొసటను కుష్ఠము గల వాడయ్యెను కనుక వారు అచ్చటి నుండి అతనిని బయటకు వెళ్లగొట్టిరి. యెహోవా తన్ను మొత్తెనని యెరిగిన వాడై తాను బయటకు వెటకు త్వరపడిన వాడయ్యెను. రాజైన ఉజ్జియా తన మరణ దినము వరకు కుష్ఠరోగియై యుండెను. అతడు ప్రత్యేకముగ ఒక యింటిలో నివసించు చుండెను. అతడు యెహోవా మందిరములో ప్రవేశించ కుండ ప్రత్యేకింపబడెను (2 దినవృత్తాం 20:21). నిజముగ గర్వము నాశనమునకు నడుపును.

"మహా ఘనుడును, మహోన్న తుడును, పరిశుద్ధుడును, నిత్యనివాసియు నైన వాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు.

నేను మహోన్నతమైన పరిశుద్ధ స్థలము లలో నివసించువాడను. అయినను వినయముగలవారి ప్రాణమును ఉజ్జీవింపచేయుటకును, నలిగిన వారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును. వినయము గలవారి యొద్దను దీన మనస్సు గలవారి యొద్దను నివసించు చున్నాను" (యెషయ 51:15).

వేల కొలది పొట్టేళ్లను, వేలాది నదులంత విస్తారమైన తైలమును అతిక్రమము కొరకై జ్యేష్ఠపుత్రుని, పాప పరిహారమూ కొరకై గర్భఫలమును ఆయనకు బలులుగా, బహు మానముగ యిచ్చిన ఆయన సంతోషించరు, గాని దీన మనస్సు గలిగి దేవుని యెదుట ప్రవర్తిచుటనే ఆయన కోరుచున్నాడు. (మీకా6:6-8). దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అను గ్రహించును (యాకోబు 4:6,8).

దేవుని యందు వినయ, భక్తులు గలిగిన శక్తిమంతుడైననాయకుడు మోషేను గూర్చి యిట్లు దేవుడు చెప్పుచున్నాడు. మోషే భూమి మీద నున్న వారందరిలో మిక్కిలి సాత్వికుడు (సంఖ్యాకాండము 12:3).

యూదారాజైన రెహబాము తన దేవునికి అవిధేయుడై ద్రోహము చేసెను. దేవుడైన యెహోవా అతనిని తృణీకరించి తన రాజ్యమును ఐగుప్తు రాజైన షీషకు చేతుల కప్పగించెను. అటు పిమ్మట ఇశ్రాయేలీయుల అధిపతులును, రాజైన రెహబామును తమ్మును తాము తగ్గించుకొని యెహోవా న్యాయస్థుడని ఒప్పుకొనిరి. వారు తమ్మును తాము తగ్గించు కొనుట యెహోవాచూచి వారిని నాశనము చేయక త్వరలోనే రక్షణ దయచేసెను. యూదా వారు కొంతమట్టుకు మంచి తనమునను సరించుట చూచి వారికి రక్షణ, నెమ్మది అనుగ్రహించెను (2 దినవృత్తాం 12:6-12).

మన రక్షకుడైన యేసు ప్రభువు దీనత్వమునకు మంచి దృష్టాంతము. అపోస్తలుడైన పౌలు ఈ విధంగ వ్రాయుచు న్నాడు. "క్రీస్తు యేసుకు కలిగి యున్న మనస్సు మీరును కలిగియుండుడి ఆయన దేవుని స్వరూపము కలిగిన వాడైయుండి, దేవునితో సమానముగ యుండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొన లేదు గాని, మనుష్యులు పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని తన్నుతానే రిక్తునిగ చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి మరణము పొందునం తగా అనగా సిలువ మరణము పొందునం తగా విధేయత చూపి తన్ను తాను రిక్తునిగా చేసికొనెను (ఫిలిప్పీ2:5,9).

ఆయన ఈ లోకములో మానవునిగ జన్మించినపుడు మిక్కిలి దీనురాలైన మరియ ఆయనను పొత్తిగుడ్డలతో చుట్టి పశువుల తొట్టిలో పరుండబెట్టెను. ఆయన మానవునిగ జీవించిన కాలమంత దీనులైన అతల్లి

దం(డ్రులకు ఎంతో విధేయుడై యుండెను (లూకా 2:51). ఆయన శతాధిపతి యొక్క విశ్వాసమును బట్టి అతనిని అభినందించెను. (మత్తయి 15:21,28). జక్కయ్య యొక్క దీనత్వమును బట్టి జక్కయ్య గృహమును దర్శించెను (లూకా 19:1-10). తన్నుతాను హెచ్చించుకొని (ప్రార్థించిన పరిసయ్యుని (ప్రార్థన కాక దీన మనసుతో (ప్రార్థించిన సుంకరి (ప్రార్థనను ఆయన అంగీకరించెను (లూకా 18:9,14). (ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి. నేను మీకు వి(శాంతి కలుగ జేతును. నేను సాత్వికుడను దీన మనస్సు గలవాడను గనుక మీ మీద నాకాడి ఎత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడిఅప్పుడు మీ (ప్రాణములకు వి(శాంతి దొరకును (మత్తయి 11:29,29, అని ఆయన చెప్పెను.

గర్వము నాశనమునకు నడుపును. ఎదుటి వాని యెడల దీనమనస్సను వస్త్రము ధరించుకొని మిమ్మును అలంకరించుకొనుడి, దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అను(గహించును దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్టమైన చేతి (క్రింద దీనమనస్కులై యుండుడి (1 పేతురు 5:6). రాజైన నెబుకద్నెజరు తన అహంకారము తరువాత (గహింపు కలిగి సర్వోన్నతుడైన దేవుని యెదుట తన్ను తాను తగ్గించు కొనెను. అతడు దేవుని మహిమపరచి, ఘనపరిచెను. "ఆయన రాజ్యము శాశ్వత రాజ్యము ఆయన ఆధిపత్యము తరతరములు నిలుచునది ఆయన పూజార్హుడు. నెబుకద్నెజరు అనునేను పరలోక మందున్న సైన్యాధిపతియైన దేవుని ఘన పరచుచున్నాను. రక్షించుటకు సమర్థుడగు దేవుడు ఈ దేవుడే. మరి ఏ దేవుడును లేడు. గర్వముగ (ప్రవర్తించు వానిని ఆయన (కుంగజేయును"(దానియేలు 3:27).

– కబిత గూటం.

# క్రీస్తు సంఘము - నిత్యరాజ్యము

## (The Lord's Church : The Eternal Kingdom)

పరలోక రాజ్యము, దేవుని రాజ్యమై యున్న క్రీస్తు సంఘమును గూర్చి నేడు అనేక అపోహలున్నాయి. క్రీస్తు యొక్క రెండవ రాకడకు ముందు భూమి మీద నున్న సంఘము పరలోక రాజ్యమై యున్నదని కొందరు బోధిస్తారు.

క్రీస్తు మరల వచ్చినప్పుడు ఆయన పిలుచుకొను పరిశుద్ధులు పరలోక రాజ్యమని కొందరు బోధిస్తారు. 'సంఘము అను పదాన్ని కొందరు తాము కూడు కొను భవనాన్ని గూర్చి చెబుతారు. మరికొందరు తమ డినామినేషన్ నే సంఘమని పిలుస్తారు. ఉదా : పెంతెకొస్తు సంఘము, బాప్టిస్టు సంఘము మొదలైనవి. ఈ అంశముపై పరిశుద్ధ గ్రంధము ఏమి చెప్పుచున్నదో జాగ్రత్తగా పరిశీలించుదము (1థెస్స 5:2). క్రైస్తవులమైన మనము, క్రొత్త నిబంధన సంఘము, రాజ్యము ఒక్కటేయని నమ్ముదుము. అది క్రీస్తు యొక్కయు అపొస్తలుల యొక్కయు పరిచర్య వలన ఆరంభించబడి నిత్యము కొనసాగింప బడునని నమ్ముదుము.

యెషయా 55:9 ఇట్లు చెప్పుచున్నది: "ఆకాశములు భూమికి పైన ఎంత యెత్తుగా ఉన్నవో మీ మార్గముల కంటేనా మార్గములు మీ తలంపులు కంటె నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి". దేవుడు మానవుని సృజించారు. మానవ మేధస్సు యొక్క సామర్థ్యాన్ని ఆయన యెరిగి యున్నారు. అందువలన ఆయన పరిశుద్ధాత్మా వేశము గల మనుష్యులచే మనుష్యుల భాషలో గ్రంధమును లిఖించి యిచ్చారు. దాని వలన మానవులందరు దేవుని వాక్యాన్ని దేవుని చిత్తాన్ని తెలిసికోగలరు. మానవుడు అర్ధము చేసికోలేని రక్షణ సంకల్పము కొరకు దేవుడు తన ఏకైక కుమారుని బలి ఇచ్చేయడు. దేవుడు గందరగోళమునకు కర్త కాదని బైబిలు బోధించుచున్నది (1 కొరింథీ 14:33). అయితే నేడింత గందరగోళం ఎందుకు వున్నది? ఒక మనుష్యుడు తన స్వకీయ ఆలోచనలను, సిద్ధాంతాలను బోధించుట కారంభించితే ఒక అబద్ధ బోధ ఆరంభమౌ తాది. క్రీస్తు సంఘ ఆరంభదినాలనుండీ అబద్ధ బోధకులున్నారు.

వెయ్యేండ్ల పాలన యనునది ఈ లోక వ్యాప్తమైన అబద్ధ బోధలలో ఒకటి. అది రెండవ శతాబ్దపు ఆరంభములోనే తలెత్తెను. మృతులపునరుత్థానము తరువాత భూమిపై రాజ్యము స్థాపించబడునని ఆబోధ యొక్క సారాంశము. ఆదిమ సంఘ చరిత్రకారులగు యూసిబియస్, డయోనిసి యస్ అనువారును, తదితరులును సెరింతస్ అను వాడు ఈ అబద్ధ బోధకు కర్తయని వ్రాసారు. అతడు దుష్టుడు, దుర్మార్గుడు. భక్తుడైన యోహానుతో తిరిగిన యువక చరిత్ర కారుడగు పోలికార్పు కూడ సెరింతస్ అనువాడు సత్యవిరోధియని చెప్పాడు. నిజానికి నేడు ఈ వేయ్యేండ్ల పాలన యను అబద్ధ సిద్ధాంతాన్ని నమ్మేవారు చెడ్డవారు కాదు. వారు మనమిత్రులు, బంధువులు కూడ, అయితే వారు నమ్మిన ప్రజలువారికి చాలకాలము నుండి దానిని బోధించారు, దానినే సత్యమని వారు అంగీకరించారు.

అయితే బెరెయలోని వారివలె మనము వినుచున్న సంగతులు " అలాగున్నవో లేదోయని ప్రతి దినము లేఖనములను పరిశోధించాలి" (అపో.కా. 17:10,11).

రాబోవు రాజ్యమును గూర్చి క్రొత్త నిబంధన బోధకులు పలుమార్లు బోధించిరి, బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి "పరలోక రాజ్యము సమీపించి యున్నది యని బోధించాడు (మత్తయి 3:1). "పరలోక రాజ్యము సమీపించి యున్నదని ప్రకటించుడి" యని యేసు తన శిష్యుల కాజ్ఞాపించారు (మత్త 10:7). మత్తయి 16:18,19లో సంఘము, రాజ్యము అను పదములు ఒకే దానిని సూచించుట కుపయోగింపబడెను.

రాబోవు రాజ్యము లేక సంఘమును గూర్చి ప్రవక్తలు యేమి వ్రాసారో ఇప్పుడు గమనించుదాం. సంఘమును వర్ణించుటకుగాను పర్వతము అను పదము తరుచు పాతనిబంధనలో వినియోగింపబడెనని గుర్తించుకొనుము. "అంత్యదినములలో పర్వతములపైన యెహెూవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండలకంటె ఎత్తుగా యెత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులో నుండి ధర్మ శాస్త్రము యెరూషలేము నుండి యెహెూవావాక్కు బయలువెళ్లును. జనులు గుంపులు గుంపులుగా వచ్చి యాకోబు దేవుని మందిరమునకు యెహెూవా పర్వతమునకు మనము వెళ్లుదము రండి, ఆయన తన మార్గముల విషయమై మనకుబోధించును, మనము ఆయన త్రోవలలో నడుతము అని చెప్పుకొందురు' (యెషయా 2:2-3). "దేవుని మందిరమే జీవముగల దేవుని సంఘమని" 1తిమోతి 3,15 లో పౌలు తెలియజేసాడు, మరల ప్రవక్తయైన దానియేలు ఇట్లు చెప్పాడు : "ఆరాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దాని కెన్నటికిని నాశనము కలుగదు, ఆరాజ్యము దాని పొందిన వారికి గాక మరెవరికిని చెందదు, అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగముల వరకు నిలుచును" (దానియేలు 2:44). ఇక్కడ చెప్పబడిన రాజులకాలము రోమా సామ్రాజ్యము. క్రీస్తు సంఘము లేక రాజ్యము స్థాపించబడిన కాలములో వారు ఏలుబడి చేసిరి.

హెబ్రీ పత్రిక లేఖకుడు దానియేలు ప్రవచన నెరవేర్పును గూర్చి చెబుతు, తానును, తన సహెూదరులును ఆ రాజ్యములో యున్నారని తెలియజేసాడు. " అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవ కృప కలిగి యుందుము, ఆ కృప కలిగి వినయభయ భక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము. ఏలయనగా మన దేవుడు

దహించు అగ్నియై యున్నాడు" (హెబ్రీ 12:29). అపో. పౌలు కొలస్స 1:13,14 లో ఇట్లు వ్రాసాడు : "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారము లోనుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసుల నుగా చేసెను. ఆ కుమారుని యందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది". "ఒకడు తన ఊహను బట్టి చెప్పుట వలన లేఖనములో ఏప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయ నగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి" యని పేతురు చెప్పాడు (2 పేతురు 1:21).

మత్తయి 16:19లో యేసు పేతురుతో, "పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీ కిచ్చెదను. నీవు భూలోకమందు దేనిబంధించుదువో అది పరలోక మందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడును" అని చెప్పెను. సంఘములో యున్నవారే రాజ్యములో యున్నవారని ఈ మాటల వలన యేసు తెలియజేసారు. పేతురుకు యేసు రాజ్యపు తాళపు చెవులు ఇస్తానని బహువచనాన్ని వినియోగించుట గమనించుము. ఏదైనా బంధింపబడిన దానిని విప్పుటకు సూచనగా 'తాళపు చెవులు' బైబిలులో వినియోగింపబడెను.

ఇప్పుడు అపొ.కార్యములు రెండవ అధ్యాయమునకు వెళ్లుదము, అక్కడ సంఘములేక రాజ్యము యొక్క ఆరంభాన్ని కనుగొంటాము. క్రైస్తవులందరికీ యిది ప్రాముఖ్యమైన అధ్యాయము. అందులో యెషయా, దానియేలుల ప్రవచనముల నెరవేర్పు మనకు కనబడ్తాది. వారిద్దరు ప్రవచించిన కాలములోనే, స్థలములోనే ఆనెరవేర్పు సంభవించెను. 36-38 వచనాలలో, " మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తు గాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొన వలెనని (పేతురు) చెప్పెను. వారు యీ మాట విని హృదయములో నొచ్చుకొని, సహోదర రులారా మేమీ చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడిగిరి అందుకు పేతురు - మీరు మారుమనస్సుపొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మయను వరమును పొందుదురు" అని చెప్పెను (అపొ .కా. 2-36,38). "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆదినమందు ఇంచుమించు మూడు వేలమంది చేర్చబడిరి" (41వ).

ఇక్కడ పేతురు తన మొదటి తాళపు చెవిని విని యోగించాడు. మరల 2 పేతురు 1:5-11లో అతడిట్లు చెప్పాడు: "ఆహేతువు చేతనే మీ మట్టుకు మీరు పూర్ణ జాగ్రత్త గలవారై మీ విశ్వాసమునందు సద్గుణము నందు జ్ఞానమును,జ్ఞానమునందు, సద్గుణమును, సహనమందు సహనము నందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను సహోదర ప్రేమయందు దయను అమర్చు కొనుడి, అవి మీకు కలిగి విస్తరించిన యెడల అవి మన ప్రభువైన యేసు క్రీస్తును గూర్చిన అనుభవ జ్ఞాన విషయములో మిమ్మును సోమరు లైనను నిష్ఫలులైనను కాకుండ చేయును. ఇవి ఎవనికి లేకపోవునో వాడు తన పూర్వ పాపములకు శుద్ధి కలిగిన సంగతి మరచిపోయి గ్రుడ్డి వాడును, దూరదృష్టి లేనివాడునగును. అందు వలన సహోదరు లారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్త పడుడి. మీరిట్టి క్రియలు చేయు వారైతే ఎప్పుడును తొట్రిల్లరు. అలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తు యొక్క నిత్య రాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును". పేతురు మొదటి తాళపు చెవిని వినియోగించి రక్షింపబడుట కేమి చేయాలో తెలియ జేసాడు. రెండవ తాళపు చెవిని వినియో గించి రక్షింపబడి యెట్లు కొనసాగాలో తెలియజేసాడు.

చివరిగా పేతురు ఇట్లు ముగించు చున్నాడు. "ప్రియులారా, మీరు ఈ సంగతులు ముందుగా తెలిసికొని యున్నారు గనుక మీరు నీతివిరోధుల తప్పు బోధవలన తొలగింపబడి, మీకు కలిగిన స్థిర మనస్సును విడిచి పడిపోకుండ కాచుకొని యుండుడి. మన ప్రభువును రక్షకుడైనైన యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందును, జ్ఞానమందును అభివృద్ధి పొందుడి ఆయనకు ఇప్పుడును యుగాంత దినము వరకును మహిమ కలుగును గాక, ఆమేన్" (2 పేతురు 3:17,18).

– లెనోర్డ్ డన్

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

# అన్యభాషల ప్రయోజనము
## (The Purpose of Tongues)

మొదటి శతాబ్ధపు సంఘమునకు దేవుడు విదేశీ భాషలను మాట్లాడే పరిశుద్ధాత్మ వరాన్ని అనుగ్రహించారు. ఆభాష వారు యిదివరలో నేర్చుకొన్నట్టిది కాదు. వేరే భాష గనుక అన్య భాషయని చెప్పబడినది. గాని ఆభాషను ఎరిగిన వారున్నట్లయితే వారికది అర్ధమయ్యే భాష. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన అపొస్తలులందరు అన్యభాషలతో మాట్లాడ సాగిరి. గాని జనసమూహములో యున్న "ప్రతి మనుష్యుడు తన స్వభాషతో వారు మాటలాడుట విని కలవరపడిరి". "ఇదిగో మాటలాడుచున్న వీరందరు గలిలయులు కారా? మనలో ప్రతి వాడుతాను పుట్టిన దేశపు భాషతో వీరు మాటలాడుట మనము వినుచున్నామే; ...... వీరు మన భాషలతో దేవుని గొప్ప కార్యములు వివరించుట వినుచున్నామని చెప్పుకొనిరి" (అపొ.కా. 2:5-12).

మొదటి శతాబ్ధపు సంఘమునకనుగ్రహింపబడిన అన్యభాషల వరమునకు మూడు ప్రయోజనములు కలవు, ఆ ప్రయోజనములు నెరవేరగానే, అద్భుతరీతిగా అన్యభాషలలో మాటలాడే వరము నిలిచిపోయెను.

**అన్యభాషలు ఒక సూచక క్రియ :**

విదేశీ (అన్య) భాషలతో మాటలాడుట పరిశుద్ధాత్ముడు అనుగ్రహించిన అద్భుత వరము . నమ్మిన వారి వలన సూచక క్రియలు కనబడునని యేసు తన అపొస్తలులకు వాగ్ధానము చేసారు (మార్కు 16:17). ఆదిమ శిష్యులు "బయలుదేరి వాక్యమంతటా ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండి వెనువెంట జరుగుచు వచ్చిన సూచక క్రియల వలన వాక్యమును స్థిరపరచుచుండెను" (మార్కు 16:20). "దేవుడు తన చిత్తానుసారముగా సూచక క్రియల చేతను, మహత్కార్యములచేతను, నానా విధములైన అద్భుతముల చేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుట చేతను వారితో కూడ సాక్ష్యమిచ్చు చుండగా వినిన వారిచేత (వాక్యము) మనకు దృఢపరచబడెను" (హెబ్రీ 2:4).

క్రైస్తవ్యము దేవుని వలన కలిగినదని యితరులు నమ్ముటకు అన్యభాషలు మొదలైన యితర అద్భుత వరములు సూచనగా ఇయ్యబడెను. ఒకడు యిదివరలో ఎన్నడు నేర్చుకొనని వేరే భాషలో మాట్లాడునప్పుడది అవిశ్వాసులకు ఒక సూచనగా యుండాలని దేవుడు కోరెను.

"కాబట్టి భాషలు విశ్వాసులకు కాదు, అవిశ్వాసులకే సూచకమై యున్నది" (1 కొరింథీ 14:22). దేవుడు సంఘములో అద్భుతరీతిగా పనిచేయుచున్నారని తెలియజేయుటకు అన్యభాషలు బహిరంగ ప్రదర్శనమై యుండెను. అవిశ్వాసులు తామెరిగిన మిత్రులు మున్నెన్నడు నేర్చుకొనని ఇంకొక భాషతో మాటలాడుట చూచారు. అందు వలన విశ్వాసులైన వారితో దేవుడున్నాడని నిరూపించుటకు అవిశ్వాసులకు భాషలు ఒక సూచనయై యుండెను.

**క్షేమాభివృద్ధి కలుగ జేయుటకు భాషలు ఇయ్యబడెను :**

"భాషతో మాటలాడువాడు తనకే క్షేమాభ్యృద్ధి కలుగ జేసికొనును" (1 కొరింథీ 14:4). ఒకడు వేరే భాషతో మాట్లాడు చుండగా దాని భావార్థము (అనువాదము) చెప్పువాడు లేని యెడల, భాషమాటలాడు వాడే క్షేమాభ్యృద్ధి నొందును. భావార్థము చెప్పువాడు లేని సందర్భాన్ని గూర్చి 1 కొరింథీ 14:4లో చెప్పబడెను. అట్టి సందర్భాల్లో భాషతో మాటలాడు వాడు మౌనముగా యుండాలని పౌలు హెచ్చరించాడు, ఏలయనగా ఒకడు అన్యభాషతో మాట్లాడితే తనకు క్షేమాభివృద్ధి కలుగ జేసికొనునుగాని , కూడివచ్చిన వారికతడు ఇబ్బంది కలుగ జేయును. అయితే తర్జుమాదారుడున్నట్లయితే సంఘమంతా ఉపదేశము (క్షేమాభివృద్ధి) పొందును.

**సువార్తవ్యాప్తికొరకు భాషలు పయోగపడెను :**

ఆదిమ క్రీస్తు సంఘాల్లో వివిధ భాషల వారుండుటయే గాక , వారు సర్వలోకానికి వెళ్లి సర్వ జనాంగములకు సువార్త ప్రకటించాలని ఆజ్ఞాపింపబడిరి (మత్త 28:19-20). ఏదైనా కొత్త ప్రాంతపు భాషలో బోధించాలన్నా, ఉపదేశించాలన్నా, ఆ ప్రాంత భాష నేర్చు కొనుటకు 6 నెలల నుండి ఒక సంవత్సర కాలము పట్టును. ఏ ప్రాంత ము వెళ్లినా పౌలు అక్కడ అంతకాలం వుండి ఆ భాష నేర్చుకొనుటకు అతనికి వీలుపడిందా? అట్టి సమయం అతను వెచ్చించగలడా? "నేను మీ యందరికంటె ఎక్కువగా భాషతో మాటలాడుచున్నాను ; అందుకు దేవుని స్తుతించుచున్నానని" అతడు వ్రాసాడు (1 కొరింథీ 14:18).

పరిశుద్ధాత్మవలన అతడు నేర్చుకొనని అనేక భాషలతో మాటలాడే వరాన్ని పౌలు పొందాడు. అట్టి అద్భుత వరము వలన అతడును, మిగతా సువార్తికులును మొదటి శతాబ్దములోనే ప్రపంచ మంతా సువార్త చాటుటకు వీలు పడింది. యేసు వారికాజ్ఞాపించిన దానిని నెరవేర్చు నిమిత్తము వారు సర్వలోకానికి వెళ్లిరి. ఆకాశము క్రిందనున్న సమస్త సృష్టికి అన్యభాషల వరము వలన వారు సువార్త

ప్రకటింపగలిగిరి (కొల్స 1:23).

**అన్యభాషలు నిలిచిపోయెను :**

దేవుని వాక్యమును స్థిరపరచుటకుగాను మొదటి శతాబ్ధములో ఇయ్యబడిన అద్భుత వరములు, అన్య భాషలతో సహా అన్నియును నిలిచి పోయెనని క్రొత్త నిబంధన బోధించుచున్నది. ఆదిమ క్రైస్తవులను విశ్వాసములో బలపరచుటకును, వాక్యమును స్థిరపరచుటకును విదేశీ భాషలు మాటలాడే అద్భుత వరము వారికను గ్రహించబడెను (మార్కు 16:17-20; హెబ్రీ 2:3,4; ఎఫెసీ 4:11,16). అపొస్తలులు వలన ఆదిమ శిష్యుల వలన ప్రకటింపబడిన వాక్యము పరిశుద్ధాత్మ శక్తి వలన స్థిరపరచబడెను (అపో.కా. 20:30; 1కొరింథీ 4:19,20, 1 థెస్స 1:5). పౌలు ప్రటించినది, సువార్తికులు, ప్రవక్తలు ప్రవచించినది కూడ అద్భుతముల వలన దృఢపరచబడెను (రోమా 15:18-19).అయితే క్రొత్త నిబంధన గ్రంధము లిఖిత పూర్వకముగా ముగించబడినప్పుడు అద్భుత వరములన్ని నిలిచిపోయాయి.

అద్భుతముల ద్వారా విశ్వాసాన్ని స్థిరపరచ వలసిన అవసరం ఈ నాడు యేమీ లేదు. మొదటి శతాబ్ధపు అనేక అద్భుతములు అందుకొరకు క్రొత్త నిబంధనలో రికార్డు చేయబడి వున్నాయి (యోహాను 20:30,31). అద్భుతముల ద్వారా స్థిపరచబడిన వాక్యము యొక్క రికార్డు (క్రొత్త నిబంధ నేడు మనకున్నది. యేసు యొక్క అనేక అద్భుతములను యోహాను రికార్డు చేసాడు. అన్నియుగాలలో యున్న జనులందరీకి విశ్వాసము కలుగజేయుటకు ఆ రికార్డు చాలని అతడు వక్కాణించాడు (యోహాను 20:30,31). అందు వలన అన్యభాషల వరము లేకుండా నేడు యేసు నందు జనులు విశ్వాస ముంచ గలరు. తన గ్రంధములో ఏవైతే రికార్డు చేయబడిందో అది మనలను ప్రతి సత్కార్యము చేయుటకు పరిపూర్ణమై యున్నదని దేవుడు చెబుతున్నారు (2 తిమోతి3:17)

అద్భుత రీతిగా కలుగు వాక్య బయల్పాటు ఆపుచేయబడునని దేవుడు జెకర్యా ప్రవక్త ద్వారా తెలియ జేసారు (జెకర్యా 13:2-5). అదెప్పుడు జరుగునో జెకర్యా చెప్పలేదుగాని ఆగిపోవునని మాత్రం తెలియ జేసాడు. 1 కొరింధీ 13:8-10లో ఈ అద్భుత వరములు నిలిచిపోవును, నిరర్ధకములగును, ఆగిపోవునని పౌలు తెలియజేసాడు, ఎఫెసీ 4లో కూడ అతడట్లు బోధించాడు.

విశ్వాసము సంపూర్తిగా బయలు పరచబడు వరకు అద్భుత వరములుంటాయని పౌలు ఎఫెసీ 4లో చెప్పాడు. "అందు చేత ఆయన ఆరోహణమైనప్పుడు చెరను చెరగా పట్టుకొనిపోయి మనుష్యులకు ఈవులననుగ్రహించెను" అని వ్రాయబడి

యున్నది (ఎఫెసీ 4:9). యేసు పరలోకమునకారోహణమైనప్పుడు ఆయన మనుష్యులకు అద్భుత వరములనిచ్చెను. "ఈ వరము పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి జెందుటకు ఇయ్యబడెను (ఎఫెసీ 4:12). "మనమందరము విశ్వాస విషయము లోను, జ్ఞాన విషయములోను ఏకత్వము పొంది సంపూర్ణ పురుషుల మగు వరకు ఆయన ఈ లాగునియమించెను' (11వ). ఇంకొక మాటలో సంఘముకు విశ్వాసము వాక్యము సంపూర్ణముగా బయల్పడు వరకు ఈ అద్భుత వరములు నియమించబడెను. ఈ విశ్వాసము పరిశుద్ధులకు ఒక్కమారే (Once for all) అప్పగింపబడినని యూదా వ్రాసాడు (యూదా :3, రోమా 10:8, కొల 3:7). అందు వలన అన్యభాషలతో మాటలాడుటతోసహా, అద్భుత వరములన్నీ ఆగిపోయాయి. దేవుని బయల్పాటు అంతా మొదటి శతాబ్దములోనే సంపూర్తి ఆయెను. సత్యవాక్యము సంపూర్తిగా క్రొత్త నిబంధనలో రికార్డుచేయబడెను. గనుక అద్భుతములు ఆగిపోయాయి. భాషలు కూడనిలిచిపోయాయి.

– రోజర్ డిక్సన్

**గమనిక :**

**సత్యవాణి T.V. కార్యక్రమములను**
**ప్రతి బుధ, వారము సాయంత్రం 6:30 గంటలకు**
**రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు**
**ఆరాధన ఛానల్ లోను, సాయంత్రము 7 గంటలకు**
**UCC. ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం**
**6:00 గంటలకు శుభవార్త ఛానల్లోను చూడండి.**

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే
సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను

బోధకులు, సభ్యులు హాజరై క్రీస్తును గూర్చి, ఆయన సంఘమును గూర్చి సత్యవాక్యమును ఆ సందర్భముగా వినగల్గిరి, హాజరైన వారందరకీ మంచి విందు ఏర్పాటు చేయబడెను. గచ్చిబౌలిలో యున్న క్రీస్తు సంఘము దేవుని సేవార్థమై బలముగా వాడబడునట్లు ప్రార్థించ మనవి.

జూన్ 15వ తేదీ మంగళ వారం రామచంద్రపురం కుమ్మరవీధిలో యున్న క్రీస్తు సంఘము యువకులు కూటము నిర్వహించిరి. సోదరులు రిక్కీగారు యువకులనుద్దేశించి చక్కటి వాక్యోపదేశము గావించిరి. సోదరులు దేసింగ్ గారు, మణి కుమార్ గారు కూడ ఆ కూటములో పాల్గొని సహకారము నందించిరి. అక్కడ దేవుని పనిని చక్కగా N. ప్రసాద్ గారు నిర్వహించుచున్నారు.

జూన్ 30వ తేదీ బుధవారం పెద్దాపురం మండలం గోరింటలో బోధకులసదస్సు జరిగెను. పలు ప్రాంతముల నుండి సువార్తికులు ఆసక్తితో సమయానికి గోరింట చేరుకొనిరి. రిక్కీగూటం గారు అధ్యక్షత వహించి సదస్సును సమర్థ వంతముగా నడిపించిరి. నేటి కాలములో దయ్యములున్నవా? యనే అంశాన్ని గూర్చి సోదరులు K. ప్రసాద్ గారు (ఖమ్మం), Ch. సద్గుణరావు గారు మాట్లాడిరి. S. యేసురత్నం గారు మూఢనమ్మకములను గూర్చి మాట్లాడిరి సోదరులు రిక్కీగూటం గారు చక్కటి వాక్యోపదేశము గావించిరి. స్థానిక క్రీస్తు సంఘము వచ్చిన వారందరికీ మంచి భోజన పానీయముల నేర్పాటు చేసిరి. గోరింట, పులిమేరు, చదలాడ గ్రామములలోను పరిసర ప్రాంతములలోను సోదరులు యమ్. ప్రేమ కుమార్ గారు దేవుని కొరకు కష్టించి పని చేయుచు అనేక హైందవులను క్రీస్తులోనికి మార్చుటకు కృషి సల్పుచున్నారు.

జూన్ 30వ తేదీ ఉదయం కొత్తపేట వాస్తవ్యులు , క్రీస్తు సంఘ సువార్తికులు N.J. మోహన్‌రావ్ గారు ప్రభువు నందు నిద్రించిరి. ఆయన ఆదినుండీ సత్యమును గూర్చి పోరాడిన మంచి యోధుడు. కొత్తపేట, బిళ్లకుర్రు, ర్యాలి మొదలగు గ్రామములలో క్రీస్తు సంఘ స్థాపన కొరకు గొప్పకృషి చేసి మంచి ఫలితములను సాధించిన సువార్తికుడు. ఆయన విడిచి వెళ్లిన కుటుంబసభ్యులు, సంఘములను గూర్చి ప్రార్థించమనవి.

## మీ కొక గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును . గాని మీరు 85/- రూ॥లు మాత్రమే. మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిలు విద్యార్థులకు, బోధకులకు, తర్భీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి:

***Satya Vani***

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**

**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2009-2011**

**To**

From:

SATYA VAKKU
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004